క్లుప్తంగా

విద్యా హక్కు చట్టాన్ని అమలుచేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని లెక్కచేయకుండా నడుస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నిశ్చితార్థ వేడుకలో డిప్యూటీ సీఎం



నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్ : న్యూ హొరైజెన్ స్కూల్ కరస్పాండెంట్, వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. న్యూ హొరైజెన్ స్కూల్ ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, కోలాకొండయ్య, రామ్మోహన్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి



ఘన నివాళులు అర్పిస్తున్న మేయర్ సురేష్ బాబు, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : విద్యావేత్త, విద్యామందిర్ స్కూల్ మాజీ కరస్పాండెంట్ రామ్మూర్తిరెడ్డి భౌతిక కాయానికి కడప మేయర్ కె. సురేష్ బాబు, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు నివాళులు అర్పించారు. ఆయన మరణించిన విషయం తెలుసుకొని గురువారం కో ఆపరేటివ్ కాలనీలోని ఆయన స్వగృహానికి వెళ్లి భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ

వల్లూరు : మండలంలోని మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీల నిర్వాహకులకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంఈవో లిల్లెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మధ్యాహ్న భోజన పథక వంట ఏజెన్సీల నిర్వాహకులు ఈ శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఫుట్‌బాల్.. ఫుల్‌జోష్..!

క్రీడల్లో ఫుట్‌బాల్‌ది ప్రత్యేకస్థానం. దేహదారుఢ్యం, వేగం, వెంటవెంటనే స్పందించే నైజం ఈ క్రీడ సొంతం. అంతర్జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్‌కు ఉండే గుర్తింపు మరేక్రీడలకు లేదనడం అతిశయోక్తి కాదు. జిల్లాలో ఈ క్రీడపట్ల యువతలో మక్కువ పెరుగుతోంది. కడప నగరంలోని వైఎస్సార్ క్రీడాపాఠశాల, డీఎస్‌ఏ క్రీడామైదానంలో సాగుతున్న ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాలకు చిన్నారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ ఆట గురించిన ప్రత్యేక కథనం.



డీఎస్‌ఏ మైదానంలో ఫుట్‌బాల్ శిక్షణలో చిన్నారులు

కడప స్పోర్ట్స్ : క్రికెట్, బ్యాడ్మింటన్ తర్వాత మనదేశంలో ఎక్కువగా ఆదరణ పొందుతున్న క్రీడ ఫుట్‌బాల్. ఫుట్‌బాల్ క్రీడ ఆడటం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు, చురుకుదనం తదితర ప్రయోజనాలు ఉన్న ఈ క్రీడలో తర్ఫీదు ఇప్పించేందుకు తల్లిదండ్రులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. వైఎస్సార్ క్రీడాపాఠశాలలో ఫుట్‌బాల్ కోచ్ హరి ఆధ్వర్యంలో, డీఎస్‌ఏ మైదానంలో ఫుట్‌బాల్ కోచ్ అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి.

శిక్షణ సాగుతోందిలా..

వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు ప్రాథమిక అంశాల మొదలుకుని క్రీడలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను తెలియజేస్తున్నారు. చిన్నారులకు ఫిట్‌నెస్ మొదలు ప్రాథమిక అంశాలు, పాసింగ్, ట్రాకింగ్, కంట్రోలింగ్, డ్రిబ్లింగ్, పొజిషన్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. గోల్‌కిక్, కార్నర్ కిక్, డైరెక్ట్ కిక్, పెనాల్టీ కిక్‌లను నేర్పుతున్నారు. అదేవిధంగా ఫుట్‌వర్క్, గోల్‌కీపింగ్, చెస్ట్ ట్రాప్, ఫుట్ ట్రాప్, త్రో ఇన్ , పుష్ పాస్, హెడింగ్ తదితర అంశాల్లో మెలకువలు నేర్పుతున్నారు. వీటితో పాటు ఆటకు సంబంధించిన నియమ నిబంధనలను తెలియజేస్తున్నారు.

కాగా ఫుట్‌బాల్ క్రీడను సాధన చేయడం ద్వారా ఎక్కువ కిలో క్యాలరీల శక్తి ఖర్చవుతుంది. రోజూ గంటపాటుసాధన చేస్తే 150 నుంచి 200 కిలో కేలరీలు ఖర్చవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

తొలిసారిగా వేసవి శిక్షణ శిబిరానికి..



ప్రతిసారి సెలవులు వస్తే ఊరికి వెళ్లేవారం. అయితే ఈ యేడాది వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు శిక్షణ శిబిరానికి వచ్చాను. అయితే నాకు ఇష్టమైన ఫుట్‌బాల్ క్రీడలో సాధన చేస్తున్నా. కోచింగ్ చక్కగా ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

- హెచ్.కార్తీక్, 6వ తరగతి, కడప

ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాణించాలని..



ఫుట్‌బాల్ క్రీడాకారుడుగా రాణించాలని ఉంది. అందుకే వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నా. క్యాంపులో ఉదయం, సాయంత్రం వచ్చి మెలుకువలు నేర్చుకుంటున్నా. నేను నా స్నేహితులందరం కలిసి మెలిసి ఆడుకోవడం సరదాగా ఉంది.

- సి. భవిక్ బెనోని చార్లెస్, 6వ తరగతి, కడప

ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం..



నాకు ఫుట్‌బాల్ ఆట అంటే ఎంతో ఇష్టం. పాఠశాల ఉన్నప్పుడు ఆడుకునేందుకు సమయం ఉండేది కాదు. వేసవి సెలవులు రావడంతో నాకు ఇష్టమైన క్రీడలో సాధన చేసుకునే అవకాశం లభించింది. దీంతో ప్రతిరోజూ మైదానానికి వచ్చి సాధన చేసుకుంటున్నా.

- ఎస్. జతిన్ విరాట్, 2వ తరగతి, కడప

సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు..



వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు వేసవి శిక్షణ శిబిరాలకు వచ్చాను. మళ్లీ పాఠశాలలు తెరిస్తే ఆడుకునే వీలు ఉండకపోవచ్చు. దీంతో ఫుట్‌బాల్ ఆడేందుకు వస్తున్నా.

- ఎస్. అహ్మద్, 7వ తరగతి, కడప

ఆంజనేయా.. ఆశీర్వదించవయా..

రేపు హనుమజ్జయంతి



కడప నగరం బ్రాహ్మణవీధిలోని శ్రీ అంజనేయస్వామి ఆలయం

కడప కల్చరల్ : శక్తి సామర్థ్యాలకు, విశ్వాసానికి, కార్యదక్షతకు, పట్టుదలకు ప్రతీక హనుమంతుడు. ఆయన అండగా ఉంటే దుష్టశక్తులు దరిచేరవన్నది భక్తుల విశ్వాసం. నిజానికి ఆయన కూడా ఒక భక్తుడే....కానీ తన అసమాన భక్తి విశ్వాసాలతో మానవ లోకానికి ఆరాధ్యుడయ్యాడు. రామయ్య భక్తునిగా ఆయన కూడా ఒక దేవుడయ్యాడు.. పూజలందుకుంటున్నాడు. జిల్లాలో ఆయనకు సంబంధించిన పలు విశేషాలు ఉన్నాయి. శనివారం హనుమజ్జయంతి నేపథ్యంలో 'సాక్షి' పాఠకుల కోసం ఆ వివరాలు.

■ ఇక్కడి పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఆ స్వామికి సంబంధించిన విశేషాలతో ముడిపడి ఉన్నాయి. అందులో ముఖ్యంగా కడప నగరంలోని దేవునికడప ఒకటి. తిరుమల తొలి గడపగా పేరొందిన దేవుని కడప శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయానికి పాలకుడు హనుమంతుడు. దేవుని కడపలో స్వామి మూల విరాట్ వెనుక దాదాపు 12 అడుగుల హనుమంతుని కుడ్య శిల్పాన్ని నేటికి మనం చూడవచ్చు.

■ కడప నగరంలో తొలిసారిగా నిర్మించినది ఆంజనేయస్వామి ఆలయమే. నవాబుల కాలంలో దీన్ని నిర్మించారు. బుగ్గ వంక ఒడ్డున బ్రాహ్మణ వీధి ప్రారంభంలో ఈ పురాతన ఆలయం ఉంది. ఒకప్పుడు కడప నగరాన్ని పాలించిన నవాబులు ఈ ఆలయాన్ని బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కట్టించి ఇవ్వడం విశేషం . కడప నగరంలో నిర్మించిన తొలి ఆలయం ఇదేనని చెప్పవచ్చు.

■ జిల్లాలో అత్యధిక మంది భక్తులు వచ్చే ఆలయాలలో వేంపల్లె వద్ద గల గండి వీరాంజనేయస్వామి ఆలయం మొదటి రెండు స్థానాల్లో ఉంటోంది. శ్రీరామచంద్రుడే స్వయంగా తన బాణం ములికతో శిలపై ఆంజనేయుడి రూపాన్ని చెక్కాడని భక్తుల విశ్వాసం. ఆ విగ్రహమే ఇక్కడ మూలవిరాట్‌గా పూజలందుకుంటోంది. ఇక్కడి రెండు కొండల గండి మధ్య బంగారు తోరణం ఉందని పుణ్యాత్ములకు తుది ఘడియల్లో మాత్రమే అది కనిపిస్తుందని చెప్పుకుంటారు. బ్రిటీష్ అధికారి సర్ థామస్ మన్రోకు ఆ తోరణం కనిపించిందన్న కథనం నేటికి వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో ఈ ఆలయాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతిష్టాత్మకంగా పునర్నిర్మిస్తున్నారు.

■ జిల్లాలో రాజుపాలెం మండలంలోని సంజీవరాయుని (హనుమంతుని) ఆలయం కూడా ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ స్వామిపై భక్తితో ఈ ప్రాంత వాసులు సంజీవరాయుడు, సంజీవయ్య, సంజీవమ్మ అని పేర్లు పెట్టుకుంటారు.

■ ప్రొద్దుటూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గల సైకత లింగం హనుమంతుడు కాశీ నుంచి తెచ్చినదేనని స్థానిక కథనం ద్వారా తెలుస్తోంది.

■ ప్రపంచంలో ఏ రామాలయాన్ని చూసినా సీతా రాముడు, లక్ష్మణ హనుమ సమేతంగా కనిపిస్తాడు. హనుమంతుడు లేకుండా ఉన్న ఆలయం మన జిల్లాలోని ఒంటిమిట్ట మాత్రమే. ఇక్కడ స్వామి, అమ్మవార్లకు హనుమంతుడు పరిచయం కాకముందే జాంబవంతుని ద్వారా ఇక్కడి మూల విరాట్ ప్రతిష్ఠింపబడ్డాయని క్షేత్రపురాణం చెబుతోంది.

■ జిల్లాలో దాదాపు 300కుపైగా ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. కడప నగరంలో 25కి పైగా ఉన్నాయి.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజులపాటు కొనసాగే శిక్షణా కాలంలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ లలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

పెండ్లిమర్రి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలని మండల స్పెషలాఫీసర్ జయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు మెను తప్పనిసరిగా పాటించాలన్నారు. వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకుని వంట పాత్రలను, కూరగాయలను శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్ రెడ్డి, ఎంఈఓ సుజాత, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి రాబోయేది వైఎస్సార్‌సీపీయే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి

కడప కార్పొరేషన్ : సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని, దీన్ని బట్టి మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి అన్నారు.

గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రెండోసారి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. కోవిడ్‌ను కూడా లెక్కచేయకుండా సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగించిన ముఖ్యమంత్రి జగన్ రుణాన్ని మహిళలు, వృద్ధులు, వికలాంగులు, నిరుద్యోగ యువత, ప్రజలు ఓటు ద్వారా తీర్చుకున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. కడప అభ్యర్థి ఎస్ బి అంజాద్ బాషా, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని అన్నారు. 2024 ఎన్నికల కౌంటింగ్ తర్వాత రాష్ట్రంలో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమని చెప్పారు.

ముగిసిన సుంకులమ్మ తిరునాల



మేయర్ సురేష్ బాబును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ నవమ బ్రహ్మోత్సవ మహోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ శర్మ ఆచారత్వమున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు.

ప్రముఖుల పూజలు

సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ కడప పార్లమెంటు అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబు, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అలాగే మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు.

పోటా పోటీగా సాగిన బండలాగుడు పోటీలు

పాలపళ్ల బండ లాగుడు పోటీలను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 14 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా పులేటుపల్లెకు చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డి ఎడ్లు, వైఎస్సార్ జిల్లా రంగసాయిపల్లెకు చెందిన ఎంవీఎస్‌ఆర్ బుల్స్ మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు రాతి దూలాన్ని సమాన దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే వైఎస్సార్ జిల్లా దాసరిపల్లెకు చెందిన బోగాది సుదర్శన్, నంద్యాల జిల్లా కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వర్‌రెడ్డి, నంద్యాల జిల్లా గుంపూరు మానిదిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా సి.కొత్తపల్లెకు చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా అప్పన పల్లికి చెందిన గురు చరణ్, గుంటూరు జిల్లా పెద్దపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. వారికి వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు.